


సమావేశంలో మాట్లాడుతున్న సంగారెడ్డి ఎస్పీ రూపేశ్

## సోషల్ మీడియాలో వచ్చే పుకార్లు నమ్మొద్దు

■ సంగారెడ్డి జిల్లా ఎస్పీ రూపేశ్

కొండాపూర్, 29 ఫిబ్రవరి: సోషల్ మీడియాలో వస్తున్న పుకార్లను ప్రజలు నమ్మొద్దని సంగారెడ్డి జిల్లా ఎస్పీ రూపేశ్ పేర్కొన్నారు. గురువారం కొండాపూర్ పోలీస్‌స్టేషన్‌లో మండల ప్రజలకు, నాయకులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఇటీవల మండలంలో టూరిస్టులను అనుమానంగా కొట్టడం సరైన పద్ధతికాదన్నారు. దానివల్ల అనవసరమైన కేసుల్లో ఇరుక్కుంటారన్నారు. ఎవరూ కూడా చట్టాన్ని చేతుల్లోకి తీసుకోకూడదని ఎస్పీ సూచించారు. పిల్లలను ఎత్తుకెళ్లడానికి వస్తున్న వార్తలు అవాస్తవమని, అలాంటి ఘటనలు జిల్లాలో ఇప్పటివరకు ఎక్కడా జరుగలేదన్నారు. కండ్లతో చూసిన వాటిని మాత్రమే నమ్మాలని, అనవసరంగా సోషల్ మీడియాలో వస్తున్న పుకార్లను ప్రజలు నమ్మి మోసపోవద్దని చెప్పారు. సైబర్ నేరాలపై కూడా ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. మార్చి 9న లోక్‌అదాలత్ ఉంటుందని, రాజీపడాల్సిన కేసులకు పరిష్కారం దొరుకుతుందన్నారు. కార్యక్రమంలో సంగారెడ్డి డీఎస్పీ సత్యయ్య, కొండాపూర్ సీఐ చంద్రయ్య, ఎస్సై హరిశంకర్ గౌడ్, సిబ్బంది, నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

**పోలీస్ 30 యాక్ట్ అమలు**

సంగారెడ్డి, ఫిబ్రవరి 29: జిల్లాలో శాంతి భద్రతలను దృష్టిలో పెట్టుకుని నెల రోజుల పాటు పోలీస్ 30 యాక్ట్ అమలులో ఉంటుందని ఎస్పీ చెన్నూరి రూపేశ్ గురువారం ప్రకటనలో తెలిపారు. 30, 30(ఎ) పోలీస్ చట్టం 1861 ప్రకారం మార్చి 1వ తేదీ నుంచి 31వ రకు యాక్ట్ అమలులో ఉంటుందని పేర్కొన్నారు. జిల్లా పరిధిలో పోలీసుల అనుమతి లేకుండా ధర్నాలు, ర్యాలీలు, మైకు పెట్టుకుని తిరగడం, రాస్తారోకోలు, సభలు, సమావేశాలు, నిరాహార దీక్షలు నిర్వహించరాదన్నారు. ప్రజా ధనానికి నష్టం కలిగించే, చట్టవ్యతిరేక కార్యకలాపాలు చేపట్టరాదని ఎస్పీ స్పష్టం చేశారు. పోలీసుల అనుమతి లేకుండా సమావేశాలు నిర్వహిస్తే సంబంధిత వ్యక్తులపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు.

# కాంగ్రెస్‌వి మోసపూరిత హామీలు

- ఉచిత పథకాలతో కొందరికే లాభం
- పార్లమెంట్ ఎన్నికల్లో కేంద్రంలో మళ్లీ అధికారంలోకి వస్తాం
- కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వెంకటరమణారెడ్డి

మనూరు, ఫిబ్రవరి 29: అధికారంలోకి రావాలనే ఉద్దేశంతో సాధ్యంకాని హామీలిచ్చి ప్రజలతో కాంగ్రెస్ ఆడుకుంటున్నదని కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి అన్నారు. గురువారం మండలకేంద్రంలో బీజేపీ విజయ సంకల్ప యాత్ర సందర్భంగా విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కేంద్రప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలన్నీ నిరుపేదలకు అందుతున్నాయన్నారు. కాంగ్రెస్ పథకాలతో కొందరికి మాత్రమే లాభం చేకూరుతుందన్నారు. అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రతిపక్ష పార్టీలపై విమర్శలు చేస్తున్నారే తప్ప పాలనపై దృష్టి సారించడం లేదన్నారు. ఎన్నో సంవత్సరాల నుంచి పాలించిన పార్టీలు కనీసం ఈ ప్రాంతంలో డబుల్ రోడ్డు వేయలేక పోయాయన్నారు. ఎంపీ ఎన్నికల్లో బీజేపీ 400 స్థానాలు గెలిచి మరోసారి అధికారంలోకి వస్తుందన్నారు. అనంతరం మనూరు నుంచి నారాయణఖేడ్ వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ డీసీసీబీ చైర్మన్ జైపాల్‌రెడ్డి, సంగప్ప, విజయ్‌పాల్‌రెడ్డి, అంబర్‌సింగ్, రజినీకాంత్, ఈశ్వరప్ప, రామకృష్ణ, అంజయ్య, వినయ్‌కుమార్ పాల్గొన్నారు.

### ఆరు గ్యారెంటీలతో అప్పుల భారం

నారాయణఖేడ్, ఫిబ్రవరి 29: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారంటీలు అమలు కావాలంటే అప్పుల భారం మరింత పెరుగుతుందని, తెచ్చిన అప్పు పథకాలకే సరిపోతే అభివృద్ధి ఎలా సాధ్యమవుతుందని బీజేపీ నేత, కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి అన్నారు. బీజేపీ చేపట్టిన విజయ సంకల్ప యాత్రలో భాగంగా గురువారం నారాయణఖేడ్‌లో బైక్ ర్యాలీ నిర్వహించిన అనంతరం రాజీవ్‌చౌక్ వద్ద రోడ్ షోలో ప్రసంగించారు. ఆరు గ్యారెంటీల అమలుకు రూ.2 లక్షల కోట్ల అప్పు చేయాల్సిన పరిస్థితి ఉందని, అప్పులను ఎత్తిచూపుతూ కేసీఆర్ ప్రభుత్వంపై విమర్శలు చేసిన కాంగ్రెస్ నాయకులు ఆరు గ్యారెంటీల పేరిట కొందరికి లాభం చేకూర్చేందుకు అందరిపై భారం మోపుతున్నారన్నారు. కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం పేదల కోసం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే విజయపాల్‌రెడ్డి, బీజేపీ నేతలు ఆలే భాస్కర్, జైపాల్‌రెడ్డి, సంగప్ప, పైడి ఎల్లారెడ్డి, సుభాష్‌రెడ్డి, రజినీకాంత్, సాయిరాం, రాజుగౌడ్ పాల్గొన్నారు.



కానుకుంట పీహెచ్‌సీ వద్ద మాట్లాడుతున్న క్షయ నివారణ సంస్థ అధికారి డాక్టర్ రాజేశ్వరి

## టీబీ రహిత సమాజమే లక్ష్యం

గుమ్మడిదల, ఫిబ్రవరి 29: జిల్లాను టీబీ రహితంగా మార్చడమే లక్ష్యమని క్షయ నివారణ సంస్థ అధికారి డాక్టర్ రాజేశ్వరి అన్నారు. గురువారం మండలంలోని కానుకుంట వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో అనంతారం పారిశ్రామికవాడలో చిత ఛాతి ఎక్స్‌రే శిబిరాలను నిర్వహించారు. శిబిరాల్లో 150 మందికి క్షయ పరీక్షలు చేశారు. వీరిలో పదిమందిని క్షయ అనుమానితులుగా గుర్తించారు. పూర్తి నిర్ధారణ కోసం వారి తెమడలను తదుపరి పరీక్షల కోసం సంగారెడ్డి ప్రభుత్వ దవాఖానకు పంపించినట్లు వైద్య సిబ్బంది తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాను టీబీ రహితంగా మార్చడానికి క్షయ పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. క్షయతో బాధపడుతున్నవారు ఎలాంటి భయందోళనకు గురికావద్దని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్లు మానస, రాజ్‌కుమార్, సీనియర్ ట్రీట్మెంట్ సూపర్‌వైజర్ దేవేందర్ రాజ్, సీనియర్ లేబరేటరీ సూపర్‌వైజర్ నర్సింహారెడ్డి, ప్రతినిధులు పురుషోత్తం, కృష్ణ, శ్రీకాంత్, ధర్మ, కిరణ్, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

## వైఎస్సార్ కాలనీలో ధ్యాన కేంద్రం ప్రారంభం

బొల్లారం, ఫిబ్రవరి 29: బొల్లారం మున్సిపాలిటీ పరిధిలోని వైఎస్సార్ కాలనీలో గురువారం మున్సిపల్ కౌన్సిలర్ చంద్రారెడ్డి ధ్యాన కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ దైనందిన జీవితంలో ధ్యానాన్ని భాగంగా చేసుకోవాలన్నారు. మానసిక రుగ్మతలను హరించి మనస్సుకు ప్రశాంతతను చేకూర్చే ఏకైక ఔషధం ధ్యానం మాత్రమేనన్నారు. ధ్యాన మందిరాన్ని ఏర్పాటు చేసి ఉచితంగా శిక్షణ ఇవ్వడానికి ముందుకొచ్చిన శిక్షకులు దత్తు, పండరీని చంద్రారెడ్డి అభినందించారు. అనంతరం కౌన్సిలర్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు చక్రపాణి, వెంకటయ్య, లక్ష్మిరెడ్డి, బాల్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, కాల నీవాసులు పాల్గొన్నారు.

## గీతంలో మొక్కలు నాటిన విద్యార్థులు



గీతం ప్రాంగణంలో మొక్కలు నాటుతున్న విద్యార్థులు

పటాన్‌చెరు, ఫిబ్రవరి 29: గీతం వర్సీటీలో చివరి సంవత్సరం విద్యనభ్యసిస్తున్న విద్యార్థులు వీడ్కోలు కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటి తమ జ్ఞాపకాలను శాశ్వతం చేసుకున్నారు. గురువారం పటాన్‌చెరు మండలం రుద్రారంలోని గీతం విశ్వవిద్యాలయంలో బీటెక్, ఎంటెక్, ఎంబీఏ, బీబీఏ, బీకాం, ఫార్మసీ, బీఏ, ఎంఏ, బీఎస్సీ, ఎమ్మెస్సీ తదితర కోర్సుల్లో విద్యను పూర్తిచేసుకున్న విద్యార్థులు ఒక్కో మొక్కను నాటారు. అటు పర్యావరణాన్ని కాపాడటంతోపాటు ఇటు చదువుకున్న విద్యాసంస్థతో శాశ్వతబంధం ఏర్పర్చుకునేందుకు హరితహారం ఉపయోగపడిందని సంబురపడ్డారు. అనంతరం గీతం స్కూల్ ఆఫ్ హ్యూమనిటీస్ అండ్ సోషల్ సైన్సెస్‌లో ప్రముఖ నృత్య కళాకారిణి, పద్మవిభూషణ్ రుక్మిణీదేవి అరుండెల్ 120వ జయంతిని నిర్వహించారు. కార్యక్రమంలో యూనివర్సిటీ అధ్యాపకులు, భరతనాట్యం ఆచార్యురాలు అక్షయజనార్దన్, డాక్టర్ లలితా సింధూరి, ఉమా శ్రీనిధి, మనస్వి, బోడపాటి అక్షయ పాల్గొన్నారు.

## ఆకట్టుకున్న విద్యార్థుల సైన్స్ ఫెయిర్



జిన్నారం: విద్యార్థుల ప్రదర్శనలను పరిశీలిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

జిన్నారం, ఫిబ్రవరి 29: జిన్నారంలోని ప్రతిభ విద్యానికేతన్‌లో గురువారం సైన్స్ ఫెయిర్‌ను ప్రిన్సిపాల్ సార శ్రీనివాస్ విద్యార్థులతో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో విద్యార్థులు సైన్స్‌కు సంబంధించిన పలు నమూనాలను ప్రదర్శించారు. జిన్నారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన పలువురు విద్యార్థులు హాజరై ప్రదర్శనలను తిలకించారు. వివిధ ఆవిష్కరణలు చేసి ప్రదర్శించిన విద్యార్థులను ప్రిన్సిపాల్ శ్రీనివాస్ అభినందించారు. కార్యక్రమంలో ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు భూపాల్‌రెడ్డి, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

**సృజనాత్మకతను వెలికితీయాలి**

సదాశివపేట, ఫిబ్రవరి 29: విద్యార్థుల్లో దాగిఉన్న సృజనాత్మకతను వెలికితీయాలని తాసీల్దార్ సరస్వతి ఉపాధ్యాయులకు సూచించారు. గురువారం పట్టణంలోని సరస్వతి శిశుమందిర్‌లో నిర్వహించిన ఎడ్యుకేషన్ ఫెయిర్‌కు ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. విద్యార్థులు ప్రదర్శించిన ఎగ్జిబిట్లను ఎంఈవో అంజయ్యతో కలిసి తిలకించి విద్యార్థులు, ఉపాధ్యాయులను అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని, సృజనాత్మకత పెంపొందించేందుకు ఎడ్యుకేషన్ ఫెయిర్ ఉపయోగపడుతుందన్నారు. అంతకుముందు తాసీల్దార్ సరస్వతి, ఎంఈవో అంజయ్యను పాఠశాల అధ్యాపక బృందం శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు సంగమేశ్వర్, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

## ఆస్తి పన్నుపై 90శాతం రాయితీ

బొల్లారం, ఫిబ్రవరి 29: మున్సిపాలిటీల్లో ఆస్తిపన్ను వడ్డీపై 90శాతం రాయితీ కల్పిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నది. ఈమేరకు మున్సిపల్ శాఖ ప్రత్యేక కార్యదర్శి దాన కిశోర్ ఉత్తర్వులు జారీ చేసినట్లు బొల్లారం మున్సిపల్ కమిషనర్ మంగతాయారు గురువారం ప్రకటనలో తెలిపారు. వడ్డీ మాఫీ కోసం ఏక మొత్తం పరిష్కారం (వన్ టైం సెటిల్‌మెంట్) 2022–23 ఆర్థిక సంవత్సరానికి ఉన్న పన్ను బకాయిలపై వడ్డీని 90శాతం మాఫీ చేసుకునే అవకాశం కల్పించినట్లు తెలిపారు. 2023 ఆర్థిక సంవత్సరం బకాయిలతోసహా ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఎవరైనా చెల్లించిన పక్షంలో 90 శాతం వడ్డీ రాయితీ వర్తిస్తుందని పేర్కొన్నారు. దీనికి తర్వాత సంవత్సరం చెల్లించాల్సిన ఆస్తి పన్నులో సర్దుబాటు చేస్తామని కమిషనర్ పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని మున్సిపల్ ప్రజలు సద్వినియోగం చేసుకొని మున్సిపల్ అభివృద్ధికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

## దొంగసరాని కుంటను పరిశీలించిన డీఈ




జిన్నారం, ఫిబ్రవరి 29 : దొంగసరానికుంటను ధ్వంసం చేసి ఆరేండ్లవుతున్నా కారకులపై చర్యలు తీసుకోకపోవడంపై ఈనెల 27న 'కబ్జాలో దొంగ సరానికుంట' శీర్షికన నమస్తే తెలంగాణలో ప్రచురితమైన కథనానికి కలెక్టర్ వల్లూరు క్రాంతి సీరియస్ అయిన విషయం విదితమే. కుంటను పూడ్చి, కట్టను పూర్తిగా తొలిగించి చదును చేసిన తీరుపై సమగ్ర విచారణకు ఆదేశించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఇరిగేషన్ డీఈ రామస్వామి, ఏఈఈ దిలీప్, వర్క్ ఇన్‌స్పెక్టర్ మధుసూదన్‌రెడ్డి గురువారం కుంటను పరిశీలించారు. ఇరిగేషన్ రికార్డుల ప్రకారం కట్ట ఉన్న స్థలాన్ని, నీటి నిలువ ఎక్కడి వరకు ఉందో తిరిగి పరిశీలించారు. కుంటను పూడ్చి, కట్టను ధ్వంసం చేసిన వారిపై జిన్నారం పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైందన్నారు. ఆక్రమించిన వారు కుంట, కట్టను పునర్నిర్మానం చేయకపోతే తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు. ఇదే ప్రాంతంలో ప్రభుత్వ అసైన్డ్ భూమిని ఆక్రమించిన వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ భిక్షపతి అన్నారు.

### నేడు విగ్రహాల ప్రతిష్ఠాపన

జహీరాబాద్, ఫిబ్రవరి 29: పట్టణంలోని సంగమేశ్వర మాణిక్‌ప్రభు ఆలయంలో నూతన విగ్రహాలను ప్రతిష్ఠిస్తున్నామని కమిటీ సభ్యులు శుక్రవారం ప్రకటనలో తెలిపారు. ఆలయంలో గణపతి, కుమారస్వామి, నంది, దక్షిణామూర్తి, లలితాంబ, సరస్వతి, నాగదేవత విగ్రహాలు, శిఖర స్థాపన నిర్వహిస్తామన్నారు. శుక్ర, శని, ఆదివారాల్లో ప్రత్యేక కార్యక్రమాలు ఉంటాయన్నారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరా రు.

### నిమ్జ్ డీసీగా రవీందర్‌రెడ్డి

జహీరాబాద్, ఫిబ్రవరి 29: జహీరాబాద్ జాతీయ పారిశ్రామిక ఉత్పత్తి మండలి(నిమ్జ్) ప్రాజెక్టు యూనిట్–2 డిప్యూటీ కలెక్టర్ వసంతకుమారిని బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. డిప్యూటీ కలెక్టర్ వసంతకుమారి సంగారెడ్డి ఆర్డీవోగా బదిలీ అయ్యారు. ఆమె స్థానంలో సంగారెడ్డి ఆర్డీవోగా పనిచేస్తున్న రవీందర్‌రెడ్డిని ఇక్కడికి డిప్యూటీ కలెక్టర్‌గా బదిలీ చేశారు.

### ఉత్తమ ఫలితాలు సాధించాలి

కోహీర్, ఫిబ్రవరి 29: విద్యార్థులు పదో తరగతి వార్షిక పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని ప్రధానోపాధ్యాయులు అన్నారు. గురువారం మండలంలోని దిగ్వాల్ జడ్పీ ఉన్నత పాఠశాల్లో పదోతరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠాలు బోధించిన ఉపాధ్యాయులతోపాటు తల్లిదండ్రులు, పాఠశాల పేరును నిలబెట్టాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

### కూలీల సంఖ్య పెంచాలి

కోహీర్, ఫిబ్రవరి 29: జాతీయ ఉపాధి హామీ పథకంలో కూలీల సంఖ్యను పెంచాలని ఈజీఎస్ ఏపీవో సునందరావు ఆదేశించారు. గురువారం కోహీర్ పట్టణంలోని ఈజీఎస్ కార్యాలయంలో ఉపాధిహామీ టీఏలు, ఎఫ్ఏలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలో 100 నుంచి 150 మంది కూలీలతో ఉపాధిహామీ పనులు చేయించాలన్నారు. నర్సరీల్లోని మొక్కలు ఎండిపోకుండా జాగ్రత్తలను తీసుకోవాలన్నారు.

**అందరికీ పని కల్పించాలి**

ఝరాసంగం, ఫిబ్రవరి 29: జాతీయ ఉపాధిహామీ పథకంలో జాబ్‌కార్డు ఉన్న కూలీలందరికీ పని కల్పించాలని మండల అభివృద్ధి అధికారి సుధాకర్ అన్నారు. గురువారం మండలపరిధిలోని జీర్లపల్లి, చిలేమామిడి గ్రామాల్లో పని చేస్తున్న ఉపాధి కూలీలతో మాట్లాడారు. కొలతల ప్రకారం పనిచేసిన కూలీలకు బిల్లులు చెల్లిస్తామన్నారు. అనంతరం జీర్లపల్లి గ్రామంలోని నర్సరీని పరిశీలించారు. ఆయన వెంట ఏపీవో రాజ్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి కృష్ణ, ఫీల్డ్ అసిస్టెంట్లు ఉన్నారు.



ఆర్డీవో కార్యాలయం ఎదుట మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి జలాలొద్దీన్

## పేదలకు ఇండ్ల స్థలాలు ఇవ్వాలి

జహీరాబాద్, ఫిబ్రవరి 29: అర్హులైన పేదలకు ప్రభుత్వం ఇండ్ల స్థలాలు మంజూరు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి జలాలొద్దీన్ డిమాండ్ చేశారు. గురువారం పేదలతో కలసి పట్టణంలో భారీర్యాలీ నిర్వహించారు. ఆర్డీవో కార్యాలయం ఎదుట ఆందోళన చేసి అధికారులకు వినతిపత్రం ఇచ్చారు. ఎంతో మంది నిరుపేదలు ఇండ్ల లేక అద్దెలు చెల్లించలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వం జహీరాబాద్ పట్టణ సమీపంలో ఉన్న ప్రభుత్వ భూములను గుర్తించి ఇండ్ల స్థలాలు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు.

## ఆటో కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలి




మాట్లాడుతున్న సాయిలు

సంగారెడ్డి, ఫిబ్రవరి 29: ఆటో కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలని, రవాణా రంగ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి సాయిలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలో ట్రాన్స్‌పోర్టు జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. సమావేశానికి హాజరైన సాయిలు మాట్లాడుతూ ఆటో కార్మికులు ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నారని, ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కేరళలో అమలవుతున్న సంక్షేమ బోర్డు విధానాలను పరిశీలించి తెలంగాణలో అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకుడు బాబూరావు, రవాణా రంగ యూనియన నాయకులు శేఖర్, మాణిక్యమ్, ప్రవీణ్, ప్రభు, రామకృష్ణ పాల్గొన్నారు.



ఎంసీహెచ్ కిట్టు అందజేస్తూ శుభాకాంక్షలు తెయజేస్తున్న వైద్యాధికారి, సిబ్బంది

### లీప్ డే.. ఒకరి జననం

సిర్గాపూర్, ఫిబ్రవరి 29: ప్రతి నాలుగేండ్లకు వచ్చే ఫిబ్రవరి 29వ తేదీని లీప్ సంవత్సరంగా పరిగణిస్తారు. స్థానిక పీహెచ్‌సీలో గురువారం ఖాజాపూర్‌కు చెందిన గిరిజన మహిళ రెండోకాన్పులో ఆడ శిశువుకు జన్మనిచ్చింది. వైద్యాధికారి విజయ్‌కుమార్, ఏఎన్ఎం సురేఖ ఆమెకు లీప్ డే శుభాకాంక్షలు తెలియజేస్తూ ఎంసీహెచ్ కిట్టును అందజేశారు.

## పల్స్‌పోలియోను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న డాక్టర్ విజయ్‌కుమార్

సిర్గాపూర్, ఫిబ్రవరి 29: మండలంలో ఆదివారం నిర్వహించే పల్స్‌పోలియోను విజయవంతం చేయాలని వైద్యాధికారి విజయ్‌కుమార్ తెలిపారు. గురువారం స్థానిక పీహెచ్‌సీలో సిబ్బంది, ఆశ వర్కర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలో ఐదేండ్ల వయస్సులోపు ఉన్న పిల్లలు 2,642 మంది ఉన్నారని చెప్పారు. మార్చి 3వ తేదీ నుంచి 5వ తేదీ వరకు మండలంలోని 20 పల్స్‌పోలియో బూతుల్లో చుక్కల మందు వేయాలన్నారు. ఈ మేరకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని చెప్పారు. రెండు రూట్లలో అధికారుల పర్యవేక్షించి పరిశీలిస్తారని, ఒక మొబైల్ టీం ద్వారా కూడా పిల్లలకు చుక్కల మందు వేస్తామని చెప్పారు.



న్యాల్‌కల్‌లో మాట్లాడుతున్న సెర్ప్ జిల్లా రిసోర్స్‌పర్సన్ మణికంఠ

### మహిళా సంఘాలకు రుణాలు

న్యాల్‌కల్, ఫిబ్రవరి 29: మహిళా సంఘాలకు పీఎంఎఫ్ఎంఈ పథకం కింద చిన్నతరహా పరిశ్రమల ఏర్పాటుకు కేంద్రప్రభుత్వం రుణాలు మంజూరు చేస్తున్నదని సెర్ప్ జిల్లా రిసోర్స్‌పర్సన్ మణికంఠ తెలిపారు. బుధవారం న్యాల్‌కల్ ఇందిరాక్రాంతి పథం కార్యాలయంలో డ్వాక్రా మహిళా సంఘాల సభ్యులకు పీఎంఎఫ్ఎంఈ పథకంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్యాంకులో రుణాలు తీసుకొని సకాలంలో తిరిగి చెల్లించి ప్రథమస్థానంలో నిలిచే సంఘాలకు పీఎంఎఫ్ఎంఈ పథకం కింద చిన్నతరహా పరిశ్రమలను ఏర్పాటు చేసుకునేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నారు. సమావేశంలో డీఆర్పీ కిరణ్, ఏపీఎం కుమార్, సీసీలు సిద్ధన్న, రాజు ఉన్నారు.

### ఆర్సీపురంలో షెడ్లు సీజ్

రామచంద్రాపురం, ఫిబ్రవరి 29: ఆర్సీపురం డివిజన్‌లోని ఇండస్ట్రియల్ స్థలంలో అనుమతులు లేకుండా కమర్షియల్ షెడ్లను నిర్మించడంతో ఐలా అధికారులు చర్యలు చేపట్టారు. పటాన్‌చెరు స్టీల్ కంపెనీ పేరు మీద ఉన్న స్థలంలో అనుమతులు లేకుండా కమర్షియల్ షెడ్లను నిర్మించినందుకు ఐలా జోనల్ మేనేజర్ ఆదేశాల మేరకు అధికారులు షెడ్లకు నోటీసులు జారీ చేసి సీజ్ చేశారు. ఈ సందర్భంగా జోనల్ మేనేజర్ అనురాధ మాట్లాడుతూ పరిశ్రమలకు సంబంధించిన స్థలంలో కమర్షియల్ షెడ్లకు అనుమతులు లేవన్నారు. అనుమతులు లేకుండా అక్రమంగా వెలిసిన మార్బుల్స్, టైల్స్, హర్ష టయోటా షోరూం తదితర షెడ్లను సీజ్ చేశామన్నారు.

## చెరుకు నారుతో రైతులకు మేలు



నారును పరిశీలిస్తున్న ఏడీఏ భిక్షపతి

కోహీర్, ఫిబ్రవరి 29: చెరుకు నారుతో రైతులకు మేలు జరుగుతుందని జహీరాబాద్ డివిజన్ వ్యవసాయాధికారి భిక్షపతి పేర్కొన్నారు. గురువారం మండలంలోని పైడిగుమ్మల్ గ్రామంలో చెరుకు నారు, చెరుకు పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా భిక్షపతి మాట్లాడుతూ చెరుకు కన్నులను మాత్రమే తీసుకొని నారుగా తయారు చేసుకోవాలన్నారు. మిగతా చెరుకు నుంచి బెల్లం, చెక్కర తయారు చేసేందుకు ఉపయోగపడుతుందన్నారు. రైతులకు ఆర్థిక ఇబ్బందులు కూడా తీరుతాయన్నారు. కార్యక్రమంలో ఏవో నవీన్‌కుమార్, ఏఈవో సవిత, విక్రమసింహారెడ్డి పాల్గొన్నారు.

## మత సామరస్యానికి ప్రతీక ఉర్సు



కుస్తీ విజేతలకు వెండి కడియం తొడుగుతున్న మల్లికార్జున్‌పాటిల్

రాయికోడ్, ఫిబ్రవరి 29: మత సామరస్యానికి ప్రతీకంగా ఉర్సు నిలుస్తుందని జడ్పీటీసీల పోరం జిల్లా అధ్యక్షుడు మల్లికార్జున్‌పాటిల్ అన్నారు. సింగీతం గ్రామంలో ఐదురోజులుగా నిర్వహిస్తున్న ఉర్సు ముగింపు కార్యక్రమానికి హాజరై దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం మల్లికార్జున్‌పాటిల్ మాట్లాడుతూ హజ్రత్ సుల్తానే దర్గ అభివృద్ధికి తనవంతుగా కృషి చేస్తానన్నారు. ఉర్సు సందర్భంగా నిర్వహించిన కుస్తీ పోటీలు ఆకట్టుకున్నాయి. పోటీల్లో గెలుపొందిన విజేతలకు ఆయన బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఎస్ఐ వెంకట్‌రెడ్డి, ఎంపీటీసీ నిరంజన్, మాజీసర్పంచ్ సంతోశ్‌కుమార్‌పాటిల్, దర్గ నిర్వాహకులు మారుఫ్ అలీ, హజర్ పాటిల్, సయ్యద్ హైమద్, ఖాజామొనోద్దీన్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు మధుపాటిల్, ప్రశాంత్‌పాటిల్ పాల్గొన్నారు.

## ఆర్ఎంసీ ప్లాంట్‌పై చర్యలు తీసుకోవాలి



వినతిపత్రం ఇస్తున్న బుచ్చిరెడ్డి

రామచంద్రాపురం, ఫిబ్రవరి 29: తెల్లాపూర్‌లోని హైహోమ్ అంకురా ఇండ్ల సమీపంలో వెలిసిన అక్రమ ఆర్ఎంసీ ప్లాంట్‌పై చర్యలు తీసుకోవాలని తెల్లాపూర్ మున్సిపాల్ కమిషనర్ సంగారెడ్డిని పీఏసీఎస్ చైర్మన్ బుచ్చిరెడ్డి కోరారు. ఆర్ఎంసీ ప్లాంట్ ఏర్పాటుతో సమీపంలో నివాసం ఉండే ప్రజలకు దుమ్మూ, ధూళి, శబ్దం, వాయుకాలుష్యంతో ఇబ్బందులు పడతారని ఆయన కమిషనర్‌కు వివరించి వినతిపత్రం అందజేశారు. ఎలాంటి అనుమతులు లేకుండా ఏర్పాటు చేస్తున్న ఆర్ఎంసీపై తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు. స్పందించిన కమిషనర్ విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని తెలిపారు.


# పంట మార్పిడితో అధిక దిగుబడులు



జహీరాబాద్ కేవీకేలో మట్టి తీసే పద్ధతిని మహిళా రైతులకు తెలుపుతున్న శాస్త్రవేత్తలు

జహీరాబాద్, ఫిబ్రవరి 29 : రైతులు ప్రతి ఏడాది మట్టి పరీక్షలు చేయించుకుంటే అధిక దిగుబడలు వస్తాయని కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ వరప్రసాద్ అన్నారు. గురువారం జహీరాబాద్ పట్టణ శివారులోని కృషి విజ్ఞానకేంద్రంలో కంగ్టి మండల రైతులకు చిరుధాన్యాల సాగు, మట్టి నమూనలు తీసే పద్ధతిపై అవగాహన కల్పించారు. రైతు పంటలు సాగు చేసేందుకు మట్టి పరీక్షలు చేసుకొని, భూమికి ఏ పంట అనుకూలంగా ఉందో తెలుసుకోవాలన్నారు. మట్టి పరీక్షలతో ఏ ఎరువు ఎంత మోతాదులో వేయాల్లో తెలుసుకోవచ్చన్నారు. ఎరువులు, కషాయాల తయారీ, చిరుధాన్యాలు తినడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. చిరుధాన్యాల ఉత్పత్తులు, వాటి ప్యాకింగ్, మార్కెటింగ్‌పై మహిళా రైతులకు అవగాహన కల్పించారు. వర్షాధారంగా చిరుధాన్యాల పంటలు సాగు చేస్తే అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. సేంద్రియ ఎరువులతో పంటలు సాగు చేస్తే మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంటుందని, పశువుల ఎరువులతో వర్షాధారంగా చిరుధాన్యాల పంటలు సాగు చేసుకోవాలని సూచించారు. అనంతరం మహిళారైతులకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో మహిళా రైతులు, కేవీకే శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

### వాసవీమాతకు పూజలు



వాసవీమాతకు పూజలు చేస్తున్న మాధవానంద సరస్వతి స్వామి

సంగారెడ్డి, ఫిబ్రవరి 29: వాసవీ కన్యకా పరమేశ్వరి మాత ఆలయ చతుర్థి వార్షికోత్సవాన్ని గురువారం వైభవంగా నిర్వహించారు. రంగంపేట పీఠాధిపతి మాధవానంద సరస్వతి స్వామి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. వార్షికోత్సవం సందర్భంగా అమ్మవారిని 102 చీరలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు తోపాజి అనంతకిషన్ ఆధ్వర్యంలో జ్యోతిర్వాసు విద్యాపీఠం వ్యవస్థాపకుడు మహేశ్వర శర్మ సిద్ధాంతి పూజలు చేశారు. మహిళలు సామూహిక కుం

**వేంకటేశ్వరాలయంలో..**

బొల్లారం ఫిబ్రవరి 29: బాలాజీనగర్‌లో శ్రీదేవి,భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి 17వ వార్షికోత్సవ బ్రహ్మోత్సవాలు గురువారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు స్వామివారికి ధ్వజారోహణ పూజలతోపాటు గరుడభేరి, అభిషేకం వంటి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ఆవరణలో భక్తులకు అన్నదానం చేశారు. భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. మార్చి 2వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి.

### నేడు కరెంట్ ఉండని ప్రాంతాలు

జహీరాబాద్, ఫిబ్రవరి 29: జహీరాబాద్ పట్టణ శివారులో ఉన్న 132/33 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా కరెంట్ సరఫరా నిలిపివేస్తున్నామని డిస్కం డీఈఈ లక్ష్మీనారాయణ ప్రకటనలో తెలిపారు. శుక్రవారం 132/33 కేవీ సబ్‌స్టేషన్‌లో ఝరాసంగం ఫీడర్ సిటీ ఫెయిల్ కావడంతో మరమ్మతులు చేసేందుకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి 4.30 గంటల వరకు డివిజన్ పరిధిలోని రంజోల్, పస్తాపూర్, అల్గోల్, దిగ్వాల్, వెంకటాపూర్, సజ్జాపూర్, మాచునూర్, ఝరాసంగం, ఎల్గోయి, జీర్లపల్లి, చీలపల్లి, రాయికోడ్, కర్చల్, మహబత్‌పూర్, సింగితం, న్యాల్‌కల్, హద్నూర్, డప్పూర్, చాల్కి, మెటల్‌కుంట, మామిడ్గి, మిర్జాపూర్, సత్వార్, ధనసిరి, బుచినెల్లి, చిన్న హైదరాబాద్, మల్చల్మా, సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరా బంద్ చేస్తామన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.